

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 25 జూలై 2025
5






ఓపెన్ స్కూళ్ల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యోగితారాణా, నవీన్ నికోలస్ తదితరులు



ఖమ్మంలో మున్నేరు ఉధృతి



మున్నేరు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల



అలుగుపారుతున్న వైరా రిజర్వాయర్

ముసురు వాన

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షం
- మున్నేరుకు పెరిగిన వరద
- పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- వైరా, కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులకు జలకళ
- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

ఖమ్మం / కొత్తగూడెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో వాన ముసురేసింది. రెండురోజులుగా విస్తారంగా పడుతున్న వర్షాలకు ఇరు జిల్లాల్లోని ప్రాజెక్టులు, చెరువులు, వాగులు, కుంటలు జలకళ సంతరించుకుంటున్నాయి. ఖమ్మం జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు 12.0మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. సింగరేణి మండలంలో అత్యధికంగా 58.6మి.మీ., కామేపల్లి 41.2మి.మీ, రఘునాథపాలెం 15.2మి.మీ, ఏన్కూరు 16.8మి.మీ, కల్లూరు 34.0మి.మీ, తల్లాడ 26.4మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లోనూ 5నుంచి20మి.మీ. వరకు వర్షం పడింది. దీంతో వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఎగువన మున్నేరు, ఆకేరు నుంచి వరదతో ఖమ్మం వద్ద మున్నేరు పోటెత్తుతోంది. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బైపాస్ బ్రిడ్జిపై నుంచి మున్నేరును పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బుధవారం 10అడుగుల వరకు ఉన్న మున్నేరు గురువారానికి 12.3అడుగులకు చేరి ఆతర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టింది. రఘునాథపాలెం మండలం మంచుకొండ వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు కొట్టుకుపోవడంతో ఖమ్మం - ఇల్లెందు రహదారిపై నీరు చేరి రాకపోకలు నిలిచాయి. దీంతో ఉదయం అధికారులు ట్రాఫిక్‌ను మళ్లించగా.. గురువారం సాయంత్రం నుంచి రాకపోకలను పునరుద్ధరించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని, చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులు నిండుకుండను (మిగతా 6వ పేజీలో)

కిన్నెరసానికి భారీగా వరద



- ఒక గేటు ఎత్తి వెయ్యి క్యూసెక్కులు విడుదల
- లోతట్టు గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ

పాల్వంచ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచలోని కిన్నెరసాని జలాశయానికి వరద ప్రవాహం భారీగా పెరిగింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 407అడుగులు కాగా గురువారం 404.40 అడుగులకు చేరడంతో రాత్రికి ఒక గేటు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో ఎగువ ప్రాంతం నుంచి 6వేల క్యూసెక్కుల చొప్పున వరదనీరు చేరింది. వరద పెరుగుతుండటంతో కిన్నెరసాని పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు దాటవద్దని అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారు.

నిండుకుండలా వైరా రిజర్వాయర్

వైరా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ నిండుకుండలా తొణికిసలాడుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 19అడుగులకు చేరింది. మూడురోజులుగా రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరదనీరు రిజర్వాయర్‌కు వచ్చిచేరుతోంది. దీంతో బుధవారం సాయంత్రానికి 18.6అడుగులుగా ఉన్న నీటిమట్టం 19అడుగులకు చేరింది. దీంతో రిజర్వాయర్‌కు చెందిన ఐదు అలుగుల నుంచి వరదనీరు ఉప్పొంగుతోంది.

మున్నేటి లంకలో చిక్కుకున్న పశువుల కాపరులు



- చింతకాని మండలం చిన్నమండవ వద్ద ఘటన
- ఐదుగురిని క్షేమంగా బయటకు తీసుకొచ్చిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

6

ఒడ్డుకు చేరిన అనంతరం అధికారులతో పశువుల కాపరులు

పిల్లల భవిష్యత్తు.. టీచర్ల చేతుల్లోనే..

- ఉపాధ్యాయుల కృషితోనే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : 'పిల్లల భవిష్యత్‌ను ఉజ్వలంగా మార్చే బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు, విద్యార్థి మధ్య అనుబంధం ఉండేలా బోధన జరగాలి' అని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ యోగితా రాణా అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఈ. నవీన్ నికోలస్, ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ రెండు రోజులుగా మోడల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశానని, సింగరేణి మండలం కారేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పని తీరు కారణంగా పాఠశాల అద్భుతంగా ఉందన్నారు. అక్కడి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని నమ్మకం కలిగిందన్నారు. ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది 140మంది విద్యార్థులు అదనంగా చేరారని, తెలుగు టీచర్ క్లాస్ వింటే తనకు కూడా అలాంటి ఉపాధ్యాయురాలు (మిగతా 6వ పేజీలో)



క్యాంపు ఆఫీసులో టీటీడీ బృందంతో చర్చిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంలో కొలువుదీరనున్న తిరుమలేశుడు

- టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరాలయం నిర్మాణం
- మంత్రి తుమ్మల చొరవతో బోర్డు అంగీకారం
- తిరుమల నుంచి ప్రత్యేక బృందం రాక
- నగరంలోని అల్లీపురం వద్ద స్థలం పరిశీలన

ఖమ్మం, జూలై 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆ కలియుగ దైవం తిరుమలేశుడు ఖమ్మంలో కొలువుదీరబోతున్నాడు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నగరంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరగబోతోంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని కలిసి ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలని విజ్ఞప్తి చేయగా.. అందుకు (మిగతా 6వ పేజీలో)

'కొండతోగు' గిరిజన చిన్నారుల కష్టాలు తీర్చండి

- వాగుపై కల్వర్టును, రహదారిని తక్షణమే నిర్మించండి
- ఐటీడీఏ పీవోకు మంత్రి తుమ్మల ఆదేశాలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఖమ్మం, జూలై 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొండతోగుకు చెందిన గిరిజన చిన్నారులు బడికి వెళ్లేందుకు కష్టాలు పడుతున్నారని, తమ గ్రామం నుంచి పండువారిగూడెంలోని బడికి వెళ్లేందుకు ఆరుకిలోమీటర్లు నడుస్తున్నారన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. 'అక్షరాలు నేర్వాలంటే ఆరు కి.మీ. నడవాల్సిందే..' శీర్షికన గురువారం కథనాన్ని ప్రచురించింది. ఆ కథనాన్ని చూసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించారు. తక్షణమే వాగు ప్రదేశాన్ని పరిశీలించి, తక్షణం అక్కడ కల్వర్టు, రహదారి ఏర్పాటుచేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్‌ను ఆదేశించారు. ఈ విషయాన్ని మంత్రి తుమ్మల వైరాలో జరిగిన జర్నలిస్టుల మహాసభలో వెల్లడించారు.

అర్హత కలిగిన వారందరికీ పథకాలు

- అభివృద్ధి, సంక్షేమంలో వెనకడుగు వేసేది లేదు
- ఇందిరమ్మ ఇళ్లపై అపోహలు అవసరం లేదు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 59, 60 డివిజన్లలో పలు పనులకు శంకుస్థాపనలు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారుడి ఇంటికి అన్ని సంక్షేమ పథకాలను అందిస్తామని, అభివృద్ధి విషయంలో వెనుకడుగేసేది లేదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగర పరిధిలోని 59వ డివిజన్ రామన్నపేటలో రూ.96లక్షలు, 60 డివిజన్‌లో రూ.కోటితో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజల దీవెనలతో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దివ్యాంగులు, పింఛనుదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- మేనిఫెస్టోలో చెప్పినట్టుగా తక్షణమే పింఛన్లు పెంచాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- ఖమ్మంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం

ఖమ్మం చర్చికాంపౌండ్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులు, ఇతర పింఛనుదారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం నగరంలోని టీఎన్‌జీవో ఫంక్షన్‌హాల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించి పింఛను లబ్ధిదారులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దివ్యాంగులకు రూ.6వేలు, ఇతర పింఛనుదారులకు రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే పింఛన్లు పెంచాలని, లేదంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. పింఛన్‌దారులకు ఆగస్టు 13లోపు పింఛన్ పెంచకపోతే ఆగస్టు 13న లక్షలాదిమంది దివ్యాంగులు, ఆసరా పింఛన్‌దారులతో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మహాగర్జన సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఆ సభకు ఆసరా పింఛన్‌దారులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళ అధ్యక్షురాలు సామినేని భవానిచౌదరి, ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ కందికట్ల విజయ్‌మాదిగ, కూచిపూడి సత్యం మాదిగ, ఎంఎస్‌పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య మాదిగ, ఎంఆర్‌పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు నుంచి టీఎన్‌జీవో ఫంక్షన్‌హాల్ వరకు ఆసరా పింఛన్‌దారులతో భారీ ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సకల శుభాల.. శ్రావణం

నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం

ఈ ఏడాది ఐదు శ్రావణ శుక్రవారాలు

వరలక్ష్మీ వ్రతాలకు, నోములకు మహిళలు సిద్ధం

28వ తేదీ నుంచి శుభ ముహూర్తాలు



ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సకల శుభాల శ్రావణమాసం శుక్రవారం నుంచి ప్రారంభం కాబోతోంది. హిందూ సంప్రదాయంలో ఎంతో పవిత్రమైన నెలగా భావించే ఈ శ్రావణమాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సారి శ్రావణంలో ఐదు శుక్రవారాలు వస్తుండగా.. ప్రతీ శుక్రవారం మహిళలు తమస్థాయికి తగ్గట్టు వరలక్ష్మీ వ్రతాలు జరుపుకొంటారు. ఇక ఈ సారి శుక్రవారమే శ్రావణమాసం మొదలవుతుండటంతో ఆలయాలలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా పెళ్లయినవారు ఏడాది తర్వాత శ్రావణమాసంలో వచ్చే ఏ మంగళవారంలో నైనా మంగళగౌరీ వ్రతం నిర్వహించుకోవచ్చని పురోహితులు చెబుతున్నారు. అలాగే పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుకుంటారు. పూజల మాసమైన శ్రావణంలో వస్త్రాలు, పూలు, పండ్లు, స్వీట్స్, బంగారం, వెండి వ్యాపారానికి గిరాకీ ఉంటుంది. ఈ నెలలో వైష్ణవారాధనతో పాటు మహాశివునికి రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ఈ పూజలకు జిల్లాలోని పలు ఆలయాలతో పాటు నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గుంటుమల్లేశ్వరాలయం, కమాన్‌బజార్ రామాలయం, కాల్వొడ్డు సీతారాంజనేయ స్వామి ఆలయం, పర్ణశాల రామాలయం, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, అభయ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ వ్రతాలు, మంగళగౌరీ వ్రతాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ నెలలో పండుగలు

శ్రావణమాసం ప్రారంభం నుంచే పండుగలు ప్రాంభంకానున్నాయి. ఈ నెల 25న తొలి శ్రావణ శుక్రవారం, ఆగస్టు 1న రెండో శుక్రవారం, ఆగస్టు 8న మూడో శుక్రవారం, వరలక్ష్మీ వత్రం, ఆగస్టు 9న రాఖీ పౌర్ణమి, ఆగస్టు 15న నాలుగో శుక్రవారం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి, ఆగస్టు 22న ఐదో శుక్రవారంతో శ్రావణమాసం ముగుస్తుంది. ఇక ఆగస్టు 27న వినాయక చవితితో భాద్రపద మాసం ప్రారంభమవుతుందని.

శుభ ముహూర్తాలిలా..

ఈ నెలలో 26, 30, 31వ తేదీలు, ఆగస్టు 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17వ తేదీల్లో శుభ ముహూర్తాలున్నట్టు పండితులు తెలిపారు. ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకు భాద్రపద మాసం ఉండగా.. ఇది శూన్య మాసం కావటంతో ముహూర్తాలు లేవని పండితులు తెలిపారు. మళ్లీ సెప్టెంబరు 23 నుంచి ప్రారంభమై 24, 26, 27, 28 తేదీల్లో, అక్టోబరు, నవంబరు నెలల్లో ముహూర్తాలున్నాయని చెబుతున్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్ట్

కామేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల నుంచి జాస్తిపల్లి వెళ్లే మార్గంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కామేపల్లి మండలానికి చెందిన నలుగురు యువకులను జూలై 23న కొత్తలింగాల నుంచి జాస్తిపల్లి వెళ్లే మార్గంలో ఓ చోట ఉండగా.. పోలీసులు వారిని గమనించి ప్రశ్నించగా వారు తడపడంతో అనుమనించి వారిని చెక్ చేయగా కవర్లలో గంజాయి దొరికింది. దీంతో పోలీసులు ఆ నలుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న గంజాయి కవర్లను, ద్విచక్ర వాహనాన్ని, మూడు మొబైల్ ఫోన్స్‌ను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు కామేపల్లి ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు. ఆ నలుగురు యువకులను సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి రిమాండ్ చేశారు.

అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు

(5వ పేజీ తరువాయి)

అవసరం లేదని, విడతల వారీగా మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు జరుగుతున్నాయని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే రేషన్‌కార్డుల ద్వారా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు అమల్లో పైసా అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు ఇళ్లకే అందిస్తామన్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో ఉన్న మూడు డివిజన్లకు తగిన రీతిలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన వారు ఇళ్లు నిర్మాణం ప్రారంభిస్తే.. నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్యూ లో చెప్పులు...
యూరియా కోసం తిప్పలు



క్యూలో చెప్పులను ఉంచిన రైతులు

చింతకాని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండల వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటం, వరి నాట్లు ప్రారంభం కావడంతో రైతులు పంట పొలాలకు యూరియా వాడకం పెరిగింది. సొసైటీల ద్వారా రైతులకు టోకెన్లు ఇచ్చి పరిమిత సంఖ్యలో యూరియా ఇస్తుండటంతో గురువారం చింతకాని సొసైటీ ఆవరణలో రైతులు క్యూలైన్‌లో గంటల కొద్ది నిలబడలేక తమ చెప్పులను క్యూలైన్లో పెట్టి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రెవెన్యూశాఖలో బదిలీలు

19 మంది ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఖమ్మం కలెక్టర్ అనుదీప్



ఖమ్మం కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలోని రెవెన్యూ శాఖలో బదిలీలు జరిగాయి. ఇప్పటికే ధరణిలో పనిచేస్తున్న డీఈవోలను బదిలీ చేయగా.. అన్ని మండలాల్లో బదిలీలు చేపట్టిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మరోమారు ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. పెద్దమెత్తంగా 19 మందికి స్థాన చలనం కలిగింది. తక్షణమే వారిని కేటాయించిన స్థానాల్లో చేరాలంటూ కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన స్థానం
ఎస్కే వహీద్	ఖమ్మం అర్బన్	రఘునాథపాలెం
జి సత్యనారాయణ	రఘునాథపాలెం	ఖమ్మం అర్బన్
బి జగదీష్	రఘునాథపాలెం, కలెక్టర్ సీసీ	చింతకాని
జి సత్యవతి	చింతకాని	రఘునాథపాలెం, డిప్యూటేషన్ కలెక్టరేట్
గిరి	కొణిజర్ల	ఆర్డీవో ఆఫీస్ , ఖమ్మం
బి సుజాత	ఆర్డీవో ఆఫీస్, ఖమ్మం	కొణిజర్ల
పి మాధవి	ఎంఎల్ఎస్ పాయింట్ ఖమ్మం అర్బన్	కొణిజర్ల, సీనియర్ అసిస్టెంట్
పి శ్రీకాంత్	వైరా	సత్తుపల్లి
ఏ జార్జ్	వేంసూర్	డీఎం సివిల్‌సప్లై, ఖమ్మం
జి సమత	మధిర, డిప్యూటేషన్ ఆర్డీవో ఆఫీస్, ఖమ్మం	సింగరేణి, డిప్యూటేషన్ కలెక్టరేట్
లక్కిరెడ్డి శిరీష	ఎర్రుపాలెం	మధిర
కె రాజశేఖర్	మధిర	ఆర్డీవో ఆఫీస్ కల్లూరు
టి పూర్ణచందర్‌రావు	ఆర్డీవో ఆఫీస్ కల్లూరు	పెనుబల్లి
ఎం నవీన్	బోనకల్	వైరా
ఎస్కే జానిమియా	సత్తుపల్లి	వేంసూరు
ఎండీ అలీఅక్బర్	వేంసూరు, డిప్యూటేషన్ కలెక్టరేట్, ఖమ్మం	ఎర్రుపాలెం
పి చంద్రకళ	ఏన్కూరు	ఆర్డీవో ఆఫీస్, కల్లూరు
కె అప్పిఅములు	ఆర్డీవో ఆఫీస్ కల్లూరు	ఏన్కూరు
ఎస్కే ఖాజామోహినుద్దీన్	తల్లాడ	సత్తుపల్లి

రామయ్యను దర్శించుకున్న యోగితారాణా



రామాలయంలో ధ్వజస్తంభం వద్ద యోగితారాణాతో దేవస్థానం అధికారులు

భద్రాచలం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యావ్యవస్థ పనితీరుపై సమీక్షించేందుకు గాను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు రోజులుగా పర్యటిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా గురువారం భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం పలికారు. వైదిక సిబ్బంది ఆమెకు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. దేవస్థానం తరపున ముఖ్య కార్యదర్శికి స్వామి వారి కండువా, ప్రసాదం అందజేశారు. యోగితారాణా వెంట దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, ఈఈ వి.రవీంద్రనాధ్, సూపరింటెండెంట్ లింగాల సాయిబాబా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గతంలో ఆమె భద్రాచలం సబ్‌కలెక్టరుగా తొలి పోస్టింగ్‌ను నిర్వహించడంతో పాటు ఐటీడీఏ పీవోగా కూడా బాధ్యతలు నిర్వహించిన క్రమంలో ఆమె రామాలయ వైదిక, పరిపాలన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా పలకరించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం సైతం ముఖ్య కార్యదర్శిని కలిశారు. ఇక పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని రామ భక్తులు గిరి ప్రదిక్షణ నిర్వహించారు. కాగా రామయ్యకు పునర్వసు కల్యాణాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

గిరిజనుడి దారుణ హత్య

నిద్రిస్తుండగా కత్తులతో పొడిచిన దుండగులు

అడ్డువచ్చిన భార్య, కుమార్తెల పైనా దాడి..

చర్ల మండలంలో ఘటన



దుండగుల చేతిలో హతమైన భద్రయ్య

చర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నిద్రిస్తున్న ఓ గిరిజనుడిని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేసిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాజయ్యనగర్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. రాజయ్యనగర్ గ్రామానికి చెందిన మడకం భద్రయ్య (44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య లక్ష్మీ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఎప్పటిలాగానే పనులు ముగించుకుని వచ్చి బుధవారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున భద్రయ్య ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు.. భద్రయ్యపై కత్తులతో దాడిచేశారు. అడ్డువచ్చిన భార్య లక్ష్మి, కుమార్తెలపై కూడా దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే రక్తపు మడుగులో ఉన్న భద్రయ్యను భార్య లక్ష్మి చర్ల వైద్యశాలకు తరలించగా.. తీవ్ర గాయాలవడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రయ్యను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందాడు. చర్ల సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. రాజయ్యనగర్ గ్రామం వలస ఆదివాసీ గ్రామం, ఛత్తీస్‌గడ్ నుంచి వచ్చి గిరిజనులు స్థిరపడ్డారు. గతంలో కూడా క్రాంతిపురం, రాజయ్యనగర్ గ్రామాల్లో ఇలాంటి హత్యలు నాలుగు జరిగాయి.

ఖమ్మంలో కొలువుదీరనున్న
తిరుమలేశుడు

(5వ పేజీ తరువాయి)

టీటీడీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే టీటీడీ నుంచి ప్రత్యేక బృందం గురువారం ఖమ్మం సమీపంలోని అల్లీపురంలో స్థలాన్ని పరిశీలించారు. వేంకటేశ్వరాలయం, భారీ కల్యాణమండపానికి అవసరమైన స్థలాన్ని సందర్శించారు. ఆలయ స్థపతి రవికాంత్ బృందంతో పాటు టీటీడీ ఎస్ఈ జగదీశ్వరరెడ్డి, ఈఈ సురేందర్‌నాథ్‌రెడ్డి, డీఈఈ నాగభూషణం, ఎలక్ట్రికల్ ఈఈ రవిశంకర్‌రెడ్డి, ఏఈ జగన్మోహన్‌రావు, వీ.వెంకటాయపాలెం, రఘునాథపాలెం సొసైటీల అధ్యక్షులు రావూరి సైదుబాబు, తాతా రఘురాం స్థలాన్ని తిలకించారు. అంతకుముందు వారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి ఆలయ నిర్మాణ నమూనాను చూపించి.. నిర్మాణ ప్రతిపాదనల గురించి చర్చించారు.

అమరావతి ఆలయం కంటే అద్భుతంగా ఉండాలి : తుమ్మల

టీటీడీ బృందంతో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. టీటీడీ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్మించే ఆలయం.. అమరావతిలో నిర్మించే ఆలయం కంటే అద్భుతంగా ఉండాలని సూచించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భద్రాద్రి రాముడి ఆశీస్సులతో నాలుగు దశాబ్దాలుగా తనకు ప్రజాసేవ చేసే అదృష్టం దక్కిందని, సీతారామ, భక్తరామదాసు లాంటి ప్రాజెక్టులు, అనేక లిఫ్ట్ ఇరిగేషన్లతో భూములను సస్యశ్యామలం చేశానన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు ఆయిల్‌పాం విస్తరణ, ఖమ్మంలో హైలెవల్ బ్రిడ్జి లాంటి అభివృద్ధి పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, ఇప్పుడు ఖమ్మం నగరానికి ఓ ఐకాన్‌గా, భవిష్యత్ తరాలకు గుర్తుండేలా వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మింపజేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఉత్సాహంగా ఐజేయూ జిల్లా మహాసభ

» హాజరైన మంత్రులు తుమ్మల, పొంగులేటి

» జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ

వైరా, జూలై 24(ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఖమ్మం జిల్లా నాలుగో మహాసభ గురువారం వైరాలోని ఓ కల్యాణమండపంలో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని టీయూడబ్ల్యూజే నాయకులు, వివిధ పత్రికలు, చానళ్ల జర్నలిస్టులు తరలొచ్చారు. ఈ మహాసభకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడిన మంత్రి తుమ్మల, అనంతరం హాజరైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహాసభల్లో వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, రాంనారాయణ, నాయకులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా కార్యవర్గాన్ని వైరాలో జరిగిన మహాసభలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మైసా పాపారావు, కోశాధికారిగా శివ, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడుగా మామిడి భూపాల్, కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా మహేందర్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : తుమ్మల

సమాజంలో అన్ని వ్యవస్థలు ఉనికిని కోల్పోతున్నాయని, ఆ వ్యవస్థలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ అయిన జర్నలిజం ఉనికికోల్పో కుండా కాపాడుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తున్నానన్నారు. రాజకీయాల్లో తనకు సంతృప్తి ఉందని, స్వర్గీయ ఎన్టీఆర్ వలనే తాను చిన్నవయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు.



సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి పొంగులేటి

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమాచారశాఖ మంత్రిగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ల మంజూరు గ్రేడింగ్ అడ్డంకిగా ఉందని, మంగళ వారం నాటికి ఆ సమస్యను ఓ కొలిక్కి తెస్తామన్నారు. ఆ వెంటనే హెల్త్ కార్డులు కూడా వస్తాయన్నారు. ఇళ్ల స్థలాల అంశం సుప్రీం కోర్టులో ఉన్నందునవలన న్యాయనిపుణులతో చర్చించి ఎలాంటి ఆటంకం కలుగకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు.

పిల్లల భవిష్యత్తు..
టీచర్ల చేతుల్లోనే..





సమీక్షిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , హాజరైన నాలుగు జిల్లాల అధికారులు

(5వ పేజీ తరువాయి)

కావాలనిపించిందన్నారు. మంచి పాఠశాలలను స్ఫూర్తిగా తీసుకుంటూ మిగిలిన విద్యాసంస్థలు కూడా సరైన మార్గంలో నడవాలన్నారు. రాష్ట్రంలో ఐటీ, వ్యవసాయ, పాలు, చేపల ఉత్పత్తి రంగాల్లో అద్భుత ఫలితాలను సాధించామని, ప్రస్తుతం విద్యారంగంలో కూడా అలాంటి విప్లవాత్మకమైన మార్పులు ఉపాధ్యాయుల వల్లే సాధ్యమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పిల్లలతో ఇంటరాక్ట్ అవుతూ బోధించడం ద్వారా విద్యార్థుల్లో కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా కృషి చేయాలన్నారు. రోజూ కనీసం 20 నిమిషాల పాటు ఏఐఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌లో విద్యార్థి ఉండేలా చూడాలని, వర్క్ బుక్స్ అభ్యసన తప్పనిసరిగా పూర్తిచేయించాలన్నారు. పదో తరగతి ఫలితాలను సబ్జెక్టు వారీగా సమీక్షించాలని, వచ్చే ఏడాది అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. సెప్టెంబర్ నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని, పిల్లలకు చిరుతిండి కోసం నిధులు అందిస్తామని, నాణ్యమైన ఆహారం అందించేలా ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఆర్‌బీఎస్కే బృందాలు నిత్యం విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించాలని, పాఠశాలల్లో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు ఆహారం మెనూ ప్రకారం అందించాలని, నాన్ వెజ్ వండే సమయంలో నాణ్యతను పరిశీలించాలని సూచించారు. తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఈ. నవీన్ నికోలస్ మాట్లాడుతూ పీఎం శ్రీకి సంబంధించిన బడ్జెట్ విడుదల అవుతుందని, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పీఎం శ్రీ పాఠశాలలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాల్లో అధికంగా ఉపాధ్యాయులున్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న పాఠశాలలకు అడ్జెస్ట్ చేయాలని కలెక్టర్లకు సూచించారు. జీరో ఎన్ రోల్‌మెంట్ ఉన్న ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీల్లో ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయాలని అధికారులకు సూచించారు. ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు డిమాండ్ ఉందని, వీటిలో సీట్లు రాని వారికి జూనియర్ కళాశాల, కేజీబీవీలలో అడ్మిషన్ తీసుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సాంకేతిక కారణాల వల్ల పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ఏకరూప దుస్తులు పంపిణీ వివరాలు ఆన్‌లైన్ లో నమోదు పూర్తి కాలేదని, త్వరలో ఈ వివరాలను అప్ డేట్ చేస్తామన్నారు. అనంతరం పదోతరగతిలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించిన, స్కూల్ రీ ఓపెన్ చేసిన, ఎన్రోల్మెంట్ పెంచిన ఎంఈఓలను సన్మానించారు. ఓపెన్ స్కూల్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమీక్షలో టీజీఆర్‌ఈఐఎస్ కార్యదర్శి రమణకుమార్, అడిషనల్ డైరెక్టర్ రాజీవ్, భద్రాద్రి ట్రెయినీ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి, జేడీఎస్ మదన్ మోహన్, సమగ్ర శిక్ష జేడీ వెంకటనర్సమ్మ, కేజీబీవీ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ హెచ్.హరీష్, మోడల్ స్కూల్స్ రాష్ట్ర ఏఎంవో బీడీఆర్ ఎస్ మంజరి, సీఎస్ఎఫ్. అసోసియేట్ డైరెక్టర్ జి.సురేష్, పి జామ్ కో ఫౌండర్ ప్రాంజలి పాఠక్, ఈడబ్ల్యూఐడీసీ షఫీమియా, ఖమ్మం డీఈవో ఎస్.సత్యనారాయణ, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి, మానుకోట జిల్లాల విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారులు, డీఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముసురు వాన

(5వ పేజీ తరువాయి)



నిండుకుండలా కిన్నెరసాని ప్రాజెక్టు

తలపిస్తున్నాయి. పలు మండలాల్లో ఉన్న చెరువులు, కుంటలు జలకళ తో ఉట్టిపడుతున్నాయి. ఎడతెరిపిలేని వర్షాలతో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, ఏరియాల్లోని ఓపెన్‌కాస్టు గనుల్లో నీరుచేరడంతో సుమారు 90వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం 7గంటల వరకు అశ్వాపురం మండలంలో 41.8 మిల్లీమీటర్లు, భద్రాచలం 10మి.మి., సుజాతనగర్ 41.5 మి.మి, మణుగూరు 55.5 మి,మి, దుమ్ముగూడెం 65.3 మి,మీ, బూర్గంపాడు 13. 8 మీ,మీ, లక్ష్మీదేవిపల్లి 25.8మీ,మీ, కొత్తగూడెంలోని గరిమెళ్లపాడు 31.8 మీ,మి, టేకులపల్లి 39.5 మి,మి, ములకలపల్లి 8.3మి,మి, జూలూరుపాడు 28.8మి,మి, పాల్వంచ 23.5మి,మి, ఆళ్లపల్లి 34.5 మి,మి, పాత కొత్తగూడెం 21.5 మి,మి, అశ్వారావుపేట 28.5, చర్ల 44. 3, దమ్మపేట 9.8 మి,మి, కరకగూడెం 74.0మిమి, అన్నపురెడ్డిపల్లి 21.0మిమి, ఇల్లెందు 44.0మిమి, గుండాల 35.5మిమి., చంద్రుగొండ 29.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం కిన్నెరసాని ప్రాజక్టుకు ఆరువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరగడంతో ప్రస్తుతం ఒక గేటు ఎత్తి వెయ్యిక్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షానికి తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి రావడంతో 4గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని బయటకు పంపిస్తున్నారు. ఈ వర్షాలతో రైతులు వానాకాలం సాగుపనులు ముమ్మరం చేయగా.. ఇప్పటికే వేసిన పత్తి పంటల్లో నీరు నిలుస్తోంది. దీంతో పంటకు చిచ్చువేసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మున్నేటి లంకలో చిక్కుకున్న ఐదుగురు పశువుల కాపరులు

చింతకాని మండలం చిన్నమండవ వద్ద ఘటన

క్షేమంగా బయటకు తీసుకొచ్చిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

చింతకాని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మున్నేటి మధ్య ఉన్న లంకలో వరదలో చిక్కుకున్న ఐదుగురు పశువుల కాపరులను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది క్షేమంగా బయటకు తీసుకొచ్చిన సంఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో గురువారం జరిగింది. చిన్నమండవ గ్రామానికి చెందిన దారెల్లి శ్రీను, గుండ్ల సాలయ్య, మొండితోక పుల్లయ్య, గుండ్ల వెంకటేశ్వర్లు, కుక్కల గోపి రోజూ లాగానే గురువారం ఉదయం పశువులను మేత కోసం మున్నేటి మధ్యలోని లంకకు తోలుకెళ్లారు. అయితే రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో మధ్యాహ్నం సమయంలో మున్నేటికి ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగింది. లంక మధ్యలో ఉన్న పశువుల కాపరులు ఆ వరదను గుర్తించకపోవడం, సమయం గడుస్తున్నా కొద్ది వరద ఉధృతి మరింత పెరగడంతో బయటకు రాలేకపోయారు. విషయాన్ని ఫోన్‌ద్వారా గ్రామస్థులకు తెలియజేయగా.. వారు అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగుల్ మీరా, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి మున్నేటి వద్దకు చేరుకుని వరద ఉధృతి గురించి ఉన్నతాధికారులకు తెలపడంతో హుటాహుటిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, వైరా ఏసీపీ రెహమాన్ మున్నేటి వద్దకు చేరుకున్నారు. ఈ లోపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు ఘటన ప్రాంతానికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందం స్పీడ్ బోట్‌ల సాయంతో వెళ్లి లంకలో చిక్కుకున్న ఆ ఐదుగురిని రెండు గంటల వ్యవధిలో సురక్షితంగా బయటకు చేర్చడంతో అటు అధికారులు, ఇటు గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

కాంబోడియాలో సైబర్ మోసాలు..
105 మంది భారతీయుల అరెస్టు

» 138 ప్రాంతాల్లో కాంబోడియా పోలీసుల దాడులు

» 3,075 మంది అనుమానితుల పట్టివేత

న్యూఢిల్లీ, జూలై 24: కాంబోడియా కేంద్రంగా చైనా సైబర్ నేరగాళ్లు నిర్వహిస్తున్న కాల్ సెంటర్లపై అక్కడి పోలీసులు దాడులు జరిపారు. 15 రోజుల పాటు.. 138 ప్రాంతాల్లో జరిపిన ఈ దాడుల్లో మొత్తం 3,075 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వీరిలో 105 మంది భారతీయులున్నారు. నిజానికి భారతీయులను ఉద్యోగాల పేరుతో కాంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తీసుకెళ్తున్న చైనా సైబర్ కేటుగాళ్లు.. వారిని అక్కడ నిర్బంధిస్తున్నారు. బలవంతంగా సైబర్ నేరాల కాల్ సెంటర్లు నిర్వహించేలా చేస్తున్నారు. మాట వినకుంటే.. కరెంటు షాకులివ్వడం, తిండితిప్పలు లేకుండా చేస్తూ.. హింసిస్తున్నారు. దీనిపై భారత ప్రభుత్వం పలు దఫాలుగా కాంబోడియా ప్రభుత్వంతో చర్చించింది. ఈ క్రమంలో కాంబోడియా పోలీసులు ఈ దాడులు జరిపారు. అరెస్టయిన వారిలో భారతీయులతోపాటు.. వివిధ దేశాల పౌరులు ఉన్నారు. కాగా.. ఈ దాడుల్లో అరెస్టయిన 105 మంది భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్ర హోంశాఖ చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

అమెరికాలో భారీగా పడిపోయిన జననాల రేటు

న్యూయార్క్, జూలై 24: అమెరికాలో సంతానోత్పత్తి దారుణంగా పడిపోతోంది. గతంలో ఎప్పుడూ లేనంత తక్కువగా గత ఏడాది జననాల రేటు నమోదైంది. 2024కు సంబంధించి వ్యాధి నియంత్రణ, నివారణ సెంటర్లు (సీడీసీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో సంతానోత్పత్తి తగ్గిపోయిన విషయం స్పష్టమైంది. జనాభా భర్తీ రేటు ప్రకారం సగటున ప్రతి మహిళకు 2.1 కంటే ఎక్కువగా పిల్లలు ఉండాల్సిన తరుణంలో.. అమెరికాలో జననాల రేటు 1.6 కంటే తక్కువగా నమోదైందని సీడీసీ వెల్లడించింది. 1960ల్లో యూఎస్‌లో జననాల రేటు సుమారు 3.5గా ఉంది. ఆ తర్వాత నుంచి క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. జననాల రేటు తగ్గిపోతోందన్న హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం సంతానోత్పత్తిని పెంచడానికి ఇటీవల చర్యలు చేపట్టింది.

గర్భిణి అనుమానాస్పద మృతి

» భార్య మృతదేహంతో 3 రోజులు ఇంట్లోనే భర్త

» స్థానికులు గమనించడంతో పరారీ

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని హెణ్ణూరు థణిసంద్రలో ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహంతో భర్త ఇంట్లోనే మూడు రోజులపాటు గడిపాడు. ఆ ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించారు. దీంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం, ఆయన భార్య సుమన్ ఆ ఇంట్లో నివసించేవారు. శివం పెయింటింగ్ పనులు చేసేవాడు. మూడురోజుల కిందట సుమన(22) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ రోజు శివం పనుల కోసం బయటకు వెళ్లాడు. భార్య మృతిచెందాక పనులకు వెళ్లాడా, ఆయన వెళ్లాక ఆమె మృతిచెందిందా అన్నది స్పష్టత లేదు. కానీ ఆ మరుసటి రోజు భార్య మృతదేహం వద్దే శివం గడిపినట్లు, అక్కడే మద్యం సేవించి, భోజనం చేసిన అనవాళ్లు ఉన్నాయి. మూడో రోజు బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడం మొదలైంది. దీంతో స్థానికులు ఆ రోజు మధ్యాహ్నం ఇంట్లోకి వెళ్లగా.. శివం ఒక్కసారిగా అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే వారు హెణ్ణూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సుమన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, శివం కోసం గాలిస్తున్నారు. సుమన మృతికి కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు.

అనిల్ అంబానీ సంస్థలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ, జూలై 24: మూడువేల కోట్ల రూపాయల బ్యాంకు రుణ మోసం, నగదు అక్రమ చలామణీ కేసు దర్యాప్తులో భాగంగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కంపెనీలు, ఎస్ బ్యాంకుకు చెందిన 35 కార్యాలయాలపై దాడులు చేశారు. నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద 25 మందిని ప్రశ్నించారు. ఆయా కార్యాలయాల నుంచి పలు పత్రాలు, కంప్యూటర్ ఉపకరణాలను (ఎక్స్‌టర్నల్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌ల వంటివి) స్వాధీనం చేసుకున్నారు. 2017-2019 మధ్య 'ఎస్ బ్యాంకు' అధికారులకు రిలయన్స్ గ్రూపు కంపెనీలు లంచాలు ఇచ్చి.. ఆ బ్యాంకు నుంచి రూ.3000 కోట్ల మేర రుణాలు పొంది, ఆ రుణాలను అక్రమంగా దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఆ రుణాల మంజూరుకు ఎస్‌బ్యాంకు వర్గాలు పలు నిబంధనలను ఉల్లంఘించాయని.. పాత తేదీతో రూపొందించిన రుణ మంజూరు గుర్తింపు పత్రాలను ఉపయోగించాయని.. మంజూరైన రుణాలను రిలయన్స్ గ్రూప్‌లోని పలు ఇతర సంస్థలకు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు రావడంతో.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) 2022 సెప్టెంబరులో రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకుడు, ఆ బ్యాంకు మాజీ ఎండీ రాణా కపూర్ పేరును సీబీఐ ప్రస్తావించింది. సీబీఐ పెట్టిన రెండు కేసులతోపాటు.. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. బ్యాంకులను, షేర్‌హోల్డర్స్‌ను, ఇన్వెస్టర్లను, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేసి ప్రజాధనాన్ని దారి మళ్లించడానికి పక్కా ప్రణాళికతో ఈ ఫ్రాడ్‌కు రూపకల్పన చేసినట్టు ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అప్పట్లో రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు రుణం మంజూరు కావడానికి ముందే.. ఎస్ బ్యాంకు ప్రమోటర్లు 'నగదు (లంచం)' అందుకున్నట్టుగా ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిందని విశ్వసనీయవర్గాల సమాచారం. ఎస్‌బ్యాంకు వద్దే కాదు.. కెనరా బ్యాంకు వద్ద సైతం ఆర్‌కామ్ ఇదే తరహాలో లంచాలిచ్చి రూ.1050 కోట్లకు పైగా రుణాలను పొందిన వైనంపైనా ఈడీ దృష్టి పెట్టినట్టు సమాచారం. రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థ బ్యాంకులు జారీ చేసే ఏటీ-1 (అడిషనల్ టైర్-1) బాండ్లలో రూ.2850 కోట్ల దాకా పెట్టుబడి పెట్టిందని.. అందుకు బదులుగా ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని ('క్విడ్ ప్రో కో'గా) ఈడీ భావిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. కాగా.. ఈడీ సోదాలతో తమ వ్యాపార కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావమూ పడలేదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా కంపెనీలు వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఈడీ సోదాలకు సంబంధించి మీడియా కథనాల్లో పేర్కొంటున్న ఆరోపణలు రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) లేదా రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్) పదేళ్ల క్రితం జరిపిన లావాదేవీలకు సంబంధించినవని వెల్లడించాయి.

ఇదేం తీర్పు?

» నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



బెంగళూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ మంజూరుచేసిన హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహించింది. 'వివేకాన్ని వాడే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందా.?' అని ఘాటుగా ప్రశ్నించింది. న్యాయ విచక్షణాధికారం తీవ్రంగా దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. 'ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వవచ్చా? హైకోర్టు చేసిన తప్పునే మేం కూడా చేయదలుచుకోలేదు. బెయిల్ తీర్పును ఇచ్చేముందు విచక్షణాధికారాన్ని కోర్టు ఉపయోగించిందో లేదో పరిశీలించాలని అనుకుంటున్నాం. అందువల్ల పిటిషన్‌పై తొందరపడి తీర్పు ఇవ్వడంగానీ, విడుదలకు లేక శిక్షలకు ఆదేశాలు ఇవ్వడంగానీ చేయబోం" అని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా.. దర్శన్, ఇతర నిందితులకు బెయిల్ ఇచ్చిన తీరును బెంచ్ తప్పుబట్టింది. "ప్రతి బెయిల్ తీర్పును హైకోర్టు ఇలాగే రాస్తుందా? ఈ కేసును హైకోర్టు చూసిన దృష్టి ఎక్కువగా మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. సెషన్స్ కోర్టు జడ్జి అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ, హైకోర్టు న్యాయమూర్తి ఇలాంటి పొరపాటు చేయడమేంటి? ఇంతేనా జడ్జి అవగాహన?. ఇది కుట్ర, హత్యలకు సంబంధించిన కేసు కావడంతో మా స్వరం కొంచెం కటువుగానే ఉంటుంది." అని బెంచ్ తెలిపింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, నటి పవిత్రాగౌడ, ఇతర నిందితులకు గత ఏడాది డిసెంబరు 13న కర్ణాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీనిపై కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఈ కేసులో పవిత్ర పాత్రపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. "అంతా మీవల్లే జరిగింది. మీరు అక్కడ లేకపోతే ఏ2 పట్టించుకునేవారుకాదు. ఏ2 స్పందించకపోతే మిగతావారూ పట్టించుకునేవారు కాదు. మొత్తం సమస్యకు మీరే కారణం." అంటూ ఆగ్రహించింది. దీనిపై పవిత్ర తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "ఆమెకు (రేణుకాస్వామి నుంచి) అభ్యంతరకర మెజేస్‌లు వచ్చేవి. నేరుగా మాట్లాడిన కాల్ రికార్డులు లేవు. అపహరణ, హత్యతో ఆమెకు సంబంధం ఉన్నట్టు ఆధారాలు లేవు" అని వాదించారు. అయితే, తాము వాదనల లోతుల్లోకి వెళ్లదలుచుకోలేదని బెంచ్ స్పష్టం చేసింది. గార్డులు కిరణ్, పునీత్‌ల వాంగ్మూలాలను హైకోర్టు ఎందుకు తిరస్కరించిందని బెంచ్ నిలదీసింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. కాల్ డేటా రికార్డులు, లోకేషన్ పిన్‌లు, దుస్తులపై, వాహనంలో దొరికిన డీఎన్ఏ, ఇతర ఆధారాలు వారిద్దరి వాంగ్మూలాలను ధ్రువీకరించాయని వాదించారు. సాక్ష్యాధారాల తీరుపై బెంచ్ పలు ప్రశ్నలు సంధించింది. "నిందితుల నుంచి మీరు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దాడి దృశ్యాలను దానిలో ఎలా బంధించారు?." అని ప్రశ్నించింది. దీనికి లూథ్రా బదులిస్తూ.. దాడి ఫొటోలు ఏ2కు ఫార్వర్డ్ అయ్యాయని, తనను కొట్టవద్దు అని హతుడు వేడుకొంటుండగా తీసిన ఫొటో కూడా అందులో ఉన్నదని తెలపగా, బెంచ్ విస్మయానికి గురయింది. "ఒకవైపు కొడుతున్నారు.. మరోవైపు ఫొటోకు పోజు ఇస్తున్నారు.. నిజంగా నమ్మలేకపోతున్నాం." అని వ్యాఖ్యానించింది. వారు తమ అభిమాన నటుడి కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉండే దర్శన్ అభిమాన సంఘానికి చెందినవారని లూథ్రా వివరించారు. "ఇదో కిరాతక హత్య. సోషల్ మీడియాలో పోస్టు చేశారనే కారణంగా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. నిందితులు దర్శన్, పవిత్రగౌడ సహా అందరి కండిషన్ బెయిల్‌ను రద్దు చేయాలి" అని ఆయన కోరారు. కాగా, దర్శన్ తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ మరో కేసును వాదించేందుకు వెళ్లడంతో లిఖితపూర్వక వాదనల కోసం వారంరోజుల గడువు ఇస్తున్నామని బెంచ్ తెలిపింది. దీంతో బెయిల్ రద్దు కావచ్చునని నిందితులలో భయం పట్టుకుంది. నిందితులకు వ్యతిరేకంగానే తీర్పు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. 'డెవిల్' సినిమా షూటింగ్ కోసం నటుడు దర్శన్ థాయ్‌లాండ్‌కు వెళ్లిన విషయం తెలిసిందే.

నకిలీ ఓట్లను అనుమతించేదే లేదు

» ఓటర్ల తొలగింపు అబద్ధం: సీఈసీ

» బిహార్‌లో ప్రత్యేక సవరణకు సమర్థన

న్యూఢిల్లీ, జూలై 24: బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. అయితే కర్ణాటకలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని.. నూరు శాతం రుజువులున్నాయని.. ఒక నియోజకవర్గంలో వందలు, వేల అదనపు ఓటర్లను చేర్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అయితే నిరాధార ఆరోపణలు చేయొద్దని, రాజ్యాంగ సంస్థను బెదిరిస్తున్నారని ఈసీ ఆక్షేపించింది. కాగా, బిహార్లో ప్రత్యేక సవరణను నిరసిస్తూ ఇండియా కూటమి ఎంపీలు గురువారం పార్లమెంటు ద్వారం వద్ద వరుసగా నాలుగో రోజూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రాహుల్ ఈసీపై విరుచుకుపడ్డారు. కర్ణాటకలో ఓ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. దీనిపై 90 శాతం కాదు.. నూరు శాతం రుజువులు చూపిస్తామని తెలిపారు. అయితే.. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. నిరాధార ఆరోపణలు చేయడమే గాక.. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను ఆయన బెదిరిస్తున్నారని విమర్శించింది.

జడ్జిల నియామకంలో జాప్యంపై విచారణ

» రెండు వారాల తర్వాత చేపట్టనున్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 24: జడ్జిల నియామకంపై కొలీజియం చేస్తున్న సిఫార్సులను ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపేందుకు గురువారం సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. రెండు వారాల తరువాత విచారణ చేపడుతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లను 2023లోనే లిస్టు చేశారని, అనంతరం ఆకస్మికంగా వాటిని జాబితా నుంచి తొలగించారని సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కొత్తగూడెం లీగల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గరువారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో గండుగులపల్లికి చెందిన వట్టి నాగేశ్వరరావు కుమార్తె వెంకటలక్ష్మిని మంగపేట మండలం, ఇమ్మంపేటకు చెందిన బత్తుల సాంబయ్య కుమారుడు శ్రీనివాస్‌కు ఇచ్చి 16ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి కుమారుడు ఉన్నారు. కొంతకాలం తర్వాత శ్రీనివాస్ అతని అక్క కుక్కునూరి సావిత్రి ఇరువురి కలిసి పెళ్లి సమయంలో ఇచ్చిన భూమిని అమ్మి డబ్బులు తేవాలని ఘర్షణపడేవారు, ఆ ఇబ్బందులు తాళలేక పుట్టింటికి వెళ్లింది. పెద్ద మనుషుల సమక్షంలో భార్యభర్తల మధ్య రాజీ కుదర్చడంతో కాపురానికి వెళ్లింది. ఈ క్రమంలో 2020 సెప్టెంబరు 11న వెంకటలక్ష్మీపై శ్రీనివాస్ కత్తితో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బత్తుల శ్రీనివాస్, కుక్కునూరు సరితలపై అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ. షుకూర్ కేసు నమోదు చేసుకోగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. భాను ప్రకాష్ దర్యాప్తు చేపట్టారు. కోర్టులో 13మంది సాక్షులను విచారించిన అనంతరం గురువారం బత్తుల శ్రీనివాస్‌పై నేరం రుజువు కావడంతో రూ.1000ల జరిమానా, జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. కుక్కునూరు సరితను నిర్దోషిగా విడుదల చేశారు. ప్రాసిక్యూషన్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవిడి లక్ష్మి నిర్వహించరు. కోర్టు నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్‌కుమార్, లైజన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పీసీ, అశోక్‌లు సహకరించారు.

డెంగీతో యోగా శిక్షకురాలి మృతి



శ్రీదేవి(ఫైల్)

తల్లాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): డెంగీతో యోగా ఇన్‌స్ట్రక్టర్ మృతిచెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. తల్లాడకు చెందిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కందుల శ్రీదేవి(32)తో పాటు ఆమె కుమార్తె యశశ్రీ, మేనల్లుడు దుట్ట నిశాల్ కూడా డెంగీ లక్షణాలతో ఖమ్మంలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మూడు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆమె మృతి చెందింది. శ్రీదేవి ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక హోమియో ఆసుపత్రిలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తుంది. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. డెంగీతో శ్రీదేవి మృతిచెందగా అదే వ్యాధి లక్షణాలతో ఆసుపత్రిలో చికిత్స పొదుతున్న కుమార్తె యశశ్రీ కన్నతల్లిని కడసారి చూసుకోలేకపోయింది.

అత్యాచారం కేసులో వ్యక్తికి 20ఏళ్ల జైలు

ఖమ్మం లీగల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడైన బాణోత్ రాములుకి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.రెండు లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా పోక్సో రెండవ ప్రత్యేక న్యాయస్థాన ఇన్‌చార్జ్ న్యాయాధికారి ఉమాదేవి గురువారం తీర్పుచెప్పారు. వివరాల ప్రకారం.. ఇంటిముందు ఆడుకుంటున్న పాపను రాములు చాక్లెట్ ఇస్తాను అని చెప్పి, బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, పొలం పనులు ముగించుకోని ఇంటికి వచ్చిన తరువాత విషయం తెలుసుకొని వెంటనే బాలిక తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుఫున పబ్లిక్ పాసిక్యూటర్ ఎండీ.ఎర్షాద్ వాదించగా, కోర్టు లైజనింగ్ అధికారులు కె.శ్రీకాంత్, కె.శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ గోపికృష్ణ, హోంగార్డు చిట్టిబాబులు సహకరించారు.

సైబర్ నేరస్థుడి అరెస్టు

ఖమ్మంక్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన రిటైర్డ్ టీచర్‌ని బెదిరించి సుమారు రూ.26లక్షల మోసం చేసిన కేసులో ఒకరిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు కడప జిల్లాలో అరెస్టు చేసినట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ గురువారం తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన రిటైర్డ్ టీచర్‌కు నిందితుడు ఫోన్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్, మనీలాండరింగ్‌కి పాల్పడ్డారని బెదిరించారు. తాము బెంగుళూరు పోలీసులమని, డిజిటల్ అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన సదరు ఉపాధ్యాయుడు ఏప్రిల్ 2025లో పలు దఫాలుగా సుమారు రూ.26లక్షలు వారి ఖాతాకు జమ చేశాడు. ఈక్రమంలో రూ.20లక్షలు అకౌంట్‌కి వెళ్లిన దామ విజయ్‌కుమార్ అనే యువకుడిని ఏపీలోని కడప జిల్లా, అక్కిరెడ్డిపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వం పెంపొందించుకోవాలి

» పాలేరు నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

» ముగిసిన రాష్ట్రస్థాయి క్లస్టర్ మీట్

» ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం



ఓవరాల్ చాంపియన్ షిప్ కప్ అందుకుంటున్న ఖమ్మం జట్టు

కూసుమంచి, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ అన్నారు. పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో రెండురోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి క్లస్టర్ క్రీడా పోటీలు ముగిశాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నాయకత్వం అనేది నైపుణ్యం, విద్యార్థి దశనుంచే దీన్ని పెంపొందించుకుంటే పాఠశాల, కళాశాల స్థాయిలోనే పునాది ఏర్పడుతుందన్నారు. క్లస్టర్ పోటీల్లో 349 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌తో పాటు ఆతిథ్య ఖమ్మంజిల్లా పాలేరు విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14,17,19 విభాగాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. అన్నింటిలోనూ ఓవరాల్ ఛాంపియన్‌గా ఖమ్మం జట్టు నిలిచింది. క్లస్టర్ మీట్‌లో ప్రతిభ కనబర్చిన 218 మంది విద్యార్థులను రీజనల్‌మీట్‌కు ఎంపికచేశారు. ఈనెల 29తేదీ నుంచి మూడురోజుల పాటు వివిధ నవోదయాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో పీఈటీలు కృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



వర్షంలోనే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పాల్వంచ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ఆశ్రమ క్రీడల మోడల్‌స్కూల్ మైదానంలో గురువారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. సుమారు 600 విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలు ప్రారంభం నుంచి చివరి వరకు జోరు వర్షంలో జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా యూత్ క్రీడల అధికారి ఎం. పరందామరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఛాంపియన్లుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన 40 మంది విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, ఆదివాసీ సమితి అధ్యక్షుడు పూనెం కృష్ణదొర, హెచ్ఎం రమారావు, అథ్లెటిక్స్ అధ్యక్షుడు రాధాకృష్ణ, పీడీ సుబ్రహ్మణ్యం, జిల్లా చీఫ్ కోచ్ పి. నాగేందర్ తదితరులున్నారు.

ఉద్యమాలను ఉధృతం చేస్తాం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన సీపీఐ 27వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రగిరి శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, రమణమూర్తి, వెంకట్, లక్ష్మీపతి, నగేష్, రత్నకుమారి, మాధవరావు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాలేరు వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



ఆదిత్య (ఫైల్)

నేలకొండపల్లి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైనంపల్లి వద్ద ఉన్న పాలేరు ఏటిలో బుధవారం ఉదయం గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. వివరాల ప్రకారం.. ఓమహిళా రైతుకు చెందిన మోటార్‌ను పాలేరు ఏటిలో ఉన్న బావిలో నుంచి బయటకు తీయటానికి కొంత మంది కూలీలను పిలిచింది. మోటారును తీయటానికి వెళ్లిన వారిలో సిద్దెల ఆదిత్య(20) అనే యువకుడు మోటార్‌ను బయటకు లాగే క్రమంలో ఏటిలోని నీటి ఉధృతికి కొట్టుకుని పోయాడు. మిగిలిన వారు ఏటిలోని నీటి ప్రవాహానికి కొట్టుకుని పోతున్న ఆదిత్యను కాపాడటానికి ప్రయత్నం చేయక పోగా, కంగారుగా వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆదిత్యతో పాటు వెళ్లిన వాళ్లు కానీ మహిళా రైతు కానీ, అతడి కుటుంబ సభ్యులకు గానీ చెప్పలేదు. విషయం తెలియని ఆదిత్య తల్లి బుధవారం సాయంత్రం వరకు కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఊరు మొత్తం వెతకటం ప్రారంభించింది. చివరకు విషయం తెలుసుకున్న ఆదిత్య తల్లి ఏటిలో మోటారు లాగటానికి వెళ్లిన మిగిలిన వారిని నిలదీయడంతో భయపడి చెప్పలేదని వాళ్లు అన్న ట్లు తెలిసింది. ఆదిత్య తల్లి బేబి బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు ఆదిత్యతో వెళ్లిన వారిని విచారించడంతో వివరాలు చెప్పారని సమాచారం. గురువారం ఉదయం పోలీసులు రెస్క్యూ టీంతో గాలింపు జరపడంతో పైనంపల్లి సమీపంలోనే ఆదిత్య మృతదేహం లభ్యమైంది. సిద్దెల బేబి, ప్రభాకర్‌కు ఇరువురు కుమారులు కాగా మృతుడు ఆదిత్య పెద్ద కుమారుడు.

కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

ఏటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసిన అనంతరం మోటర్‌ను బయటకు తీసేందుకు పిలిచిన మహిళా రైతు ఇంటి వద్దకు తీసుకెళ్లి ఆందోళనకు దిగారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుడి తల్లి బేబి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదలు సంభవించే ప్రాంతాలను గుర్తించి అక్కడ నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహ సమయంలో నదులు, కాల్వలు, చెరువులు వంటి జలవనరుల వద్దకి వెళ్ల కూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని స్పష్టం చేశారు. ప్రసవం సమీపించిన గర్భిణులను ముందుగానే ఆసుపత్రులు, వసతి కేంద్రాలకు తరలించాలని సూచించారు.

వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు: ఖమ్మం సీపీ

ఖమ్మం, జూలై24(ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో భారీవర్షాలు కురిసేఅవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పోలీసుకమిషనర్ సునీల్‌దత్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఎవరు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, వాగుల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుందని తెలిపారు. వర్షం పడినప్పుడు చెట్ల కింద ఉండవద్దన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు లేదా పోలీసుకంట్రోల్ నెంబరు 8712659111కు టోల్‌ఫ్రీ నెంబరు 1077 సెల్ 9063211298కు ఫోన్‌చేయాలని కోరారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు భద్రాద్రి క్రీడాకారుడు అభినయ్ ఎంపిక



కోచ్‌తో అభినయ్

చుంచుపల్లి, జూలై24(ఆంధ్రజ్యోతి): జాతీయ బాక్సింగ్ పోటీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారుడు జె.అభినయ్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కొత్తగూడెం శిక్షకుడు సత్యబాబు గురువారం తెలిపారు. శుక్రవారం తమిళనాడు రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు భద్రాద్రి జిల్లా నుంచి పాల్గొననున్నాడు. ఖమ్మం బ్ల్యూమింగ్ మైండ్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ తొలి ఏడాది చదువుతున్న విద్యార్థి జె.అభినయ్ ఎంపికవడం పట్ల వివిధ క్రీడా అసోసియేషన్ బాధ్యులు, క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపి పతకం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఖమ్మం ఆర్టీసీ డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా గౌతమి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఆర్టీసీ డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా గౌతమి నియమితులయ్యారు. ప్రస్తుతం ఖమ్మం డిపోలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ రామయ్యను భద్రాచలం డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీపై వెళుతున్న రామయ్యను గురువారం ఖమ్మం డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్, డిపో నాయకులు సన్మానించారు. గౌతమి గతంలో ఖమ్మండిపోలో ఇదే హోదాలో విధులు నిర్వహించి భద్రచలం డిపోకు బదిలీపై వెళ్లారు. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న పాలకులు

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు

తిరుమలాయపాలెం, జూలై24(ఆంధ్ర జ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలు గాలికి వదిలి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ప్రశ్నించే వారిపై పాలకులు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడం దుర్మార్గమన్నారు. శాంతిచర్చలు జరిపి ఎన్‌కౌంటర్‌లు ఆపాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించిందన్నారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు గుర్రం అచ్చయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, బందెల వెంకయ్య, ఆర్.శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, టి.వెంకటస్వామి.ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్

- నగరంలో ప్రతీ విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలు పెంపు లక్ష్యం
- విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా
- ఎన్నెస్పీ కాలనీ ప్రాథమిక పాఠశాల తనిఖీ


విద్యార్థులతో కలిసి తరగతులు వింటున్న యోగితా రాణా

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై24(ఆంధ్ర జ్యోతి): నగరంలో 30కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న ప్రతీప్రాథమిక పాఠశాలలో ఏఐల్యాబ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ సంచాలకుడు ఈ.నవీన్ నికోలస్, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజలతో కలిసి గురువారం నగరంలోని ఎన్నెస్పీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రాథమిక పాఠశాలలోని కృత్రిమ మేధస్సు(ఏఐ)పై ఏర్పాటు చేసిన ఏఐఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌ను, 4వతరగతిలో బోధనను పరిశీలించారు. కృత్రిమ మేధస్సు ద్వారా ప్రతీ విద్యార్థి కనీస విద్యాప్రమాణాలు పెంపులక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల చదువుతున్నారని తెలుసుకుని పాఠశాల సిబ్బందిని అభినందించారు. మన పాఠశాలకు వచ్చిన పిల్లలు వేరే పాఠశాలకు వెళ్లకుండా చూసుకోవాలని, 5వ తరగతి తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వైపు వెళ్లేలా విద్యార్థులను ప్రోత్సహించాలని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ద్వారా విద్యా బోధన ప్రారంభించామని 1 నుంచి 5వ తరగతి వరకు ఏఐ బోధించే పాఠాలను ఒక యాప్‌నకు అనుసంధానించి ప్రతి విద్యార్థి పురోగతిని అధ్యయనం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రాజీవ్, ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి, జేడీఎస్ మదన్ మోహన్, సమగ్ర శిక్ష జేడీ వెంకట నర్సమ్మ, కేజీబీవీ రాష్ట్ర కో ఆర్డినేటర్ హెచ్.హరీష్, మోడల్‌స్కూల్స్ రాష్ట్రఏ.ఎంవో బీడీఆర్ఎస్ మంజరి, జిల్లా విద్యాశాఖఅధికారి ఎస్.సత్యనారాయణ, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, హెడ్‌మాస్టర్‌బుర్రీ వెంకన్న పాల్గొన్నారు.

గడువులోపు డైట్ కళాశాల భవన పనులు పూర్తి చేయాలి

నిర్దిష్ట గడువులోగా డైట్‌కళాశాల భవన నిర్మాణ, ఆధునికీకరణ అదనపు సదుపాయాల పనులు పూర్తి చేయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం డైట్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణ, ఆధునికీకరణ అదనపు సదుపాయాల పనులను పరిశీలించారు. పనులలో నాణ్యతను పరిశీలించిన తర్వాతే పూర్తి స్థాయి బిల్లు పేమెంట్ జరుగుతుందని స్పష్టం చేశారు. అవసరమైన ఫర్నీచర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు.

మంత్రి తుమ్మలను కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్



ఖమ్మంకలెక్టరేట్,జూలై24(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావును జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం నరేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి ఆయన పుష్పగుచ్ఛాలు అందించారు. ఆస్పత్రిలో అంకితభావంతో పనిచేయాలని అభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

ఎరువుల దుకాణం తనిఖీ

తిరుమలాయపాలెం, జూలై24(ఆంధ్ర జ్యోతి): మండలంలోని బచ్చోడు, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, దమ్మాయిగూడెం, బీరోలు తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఏవో సీతారాంరెడ్డి తనిఖీ చేశారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఏవో హెచ్చరించారు.

ఖమ్మం, ఇల్లెందు రోడ్డులో రాకపోకలకు అంతరాయం

- మంచుకొండ వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి
- మల్లేపల్లి నుంచి ఖమ్మానికి రాకపోకలు
- మధ్యాహ్నం తర్వాత రహదారి పునరుద్ధరణ


కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి


నిలిచిన వాహనాలు

రఘునాథపాలెం, జూలై24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఇల్లెందు ప్రధాన రహదారి రఘునాథపాలెం మండలం మంచుకొండ వద్ద గురువారం తెల్లారుజాము నుంచి మధ్యాహ్నం వరకు రవాణా మార్గం బంద్ అయింది. పది నెలల క్రితం రఘునాథపాలెం ప్రభుత్వ కార్యాలయాల నుంచి బూడిదంపాడు వరకు రహదారి విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే మంచుకొండ వద్ద కల్వర్టు నిర్మాణం జాప్యం జరిగింది. బుధవారం కురిసిన వర్షాలకు మంచుకొండ సమీప ప్రాంతాల వరద కల్వర్టుకు చేరింది. దీంతో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. స్థానిక పోలీసులు స్పందించి మంచుకొండ నుంచి మల్లేపల్లి ద్వారా జింకలతండా తిరిగి రఘునాథపాలెం ప్రభుత్వ కార్యాలయాల వరకు రహదారి మళ్లింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం నుంచి తిరిగి ఇల్లెందు ఖమ్మం రహదారి అందుబాటులోకి వచ్చింది.

బురదలేని అంతర్గత రోడ్ల నిర్మాణమే లక్ష్యం

- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలో బురదలేని అంతర్గత రోడ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు నుంచి రామన్నపేట వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు, పల్లెగూడెం నుంచి ఊటవాగుతండా రోడ్డుకు, మంగళగూడెం నుంచి బీటీ రోడ్‌కు, కొత్తూరు నుంచి లకావత్ తండాకు నిర్మించనున్న రహదారులకు గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతు నియోజకవర్గంలోని అన్నిగ్రామాల ప్రజల సౌకర్యార్థం రహదారుల నిర్మాణాలన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆర్డీవో నరసింహరావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వాణీశ్రీ తహసీల్దార్ రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, మద్దిమల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, ముక్కా శేఖర్ గౌడ్, కిషోర్‌రెడ్డి, పంతులు నాయక్, బండి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీసర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కూసుమంచి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుర్వాయిగూడెం మాజీసర్పంచి సారబుడ్ల నారాయణరెడ్డి కుటుంబాన్ని గురువారం పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మరో రెండు కుటుంబాలను మంత్రి పరామర్శించారు. వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి పాలేరుకు అనుసంధానం చేయాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

కూసుమంచి, జూలై 24(ఆంధ్రజ్యోతి):సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి పాలేరు జలాశయానికి అనుసంధానం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం కూసుమంచి పార్టీ కార్యాలయంలో రైతుసంఘం మండల మహాసభల్లో పాల్గొన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటితో పాలేరు జలాశయాన్ని నింపాలని అప్పుడే జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. వైరా, కల్లూరు మండలాలతో పాటు అన్ని ప్రాంతాలకు నీరందుతేనే సస్యశ్యామలం అవుతుందన్నారు. తమ్మినేని వీరభద్రం పాదయాత్ర పోరాట ఫలితంగానే సీతారామ ప్రాజెక్టు వచ్చిందని గుర్తు చేశారు. తోటకూరి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుసంఘం నూతన మండల కమిటీ అధ్యక్షులుగా రమణారెడ్డి, కార్యదర్శిగా గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మల్లెల షన్మతిరావు, గురుమూర్తి, బడేటి శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాలేరు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని గురువారం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాకు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. మద్దులపల్లిలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు సొంత భవనాలు, రెగ్యులర్ అధ్యాపకులు, ల్యాబ్స్, గ్రంథాలయం లేకపోవటంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖమ్మంలో రెండు సంవత్సరాల క్రితం జేఎన్‌టీయూ కళాశాల పాతభవనంలో ఏర్పాటు చేశారని అన్నారు. సౌకర్యాలు లేక సీట్లు వచ్చినా విద్యార్థులు వదులుకుంటున్నారని తెలిపారు. వెంటనే సొంతభవనాలు ఏర్పాటు చేసి, రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని కోరారు.

కార్మిక వ్యతిరేక జీవోను రద్దు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై24 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 8గంటల పని విధానం అమలులో ఉంటే, కార్మికులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పది గంటలు పనిచేయాలని కార్మిక వ్యతిరేక జీవో 282ను అమలులోకి తీసుకొచ్చిందని దానిని వెంటనే రద్దు చేయాలని టీయూసీఐ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పేరాబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం బల్లేపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 31న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మికులు అందరూ కలిసి రావాలని కోరారు. సంఘం నాయకులు కే శ్రీనివాస్, వేముల ఉపేందర్, నాగరాజు, కృష్ణ ఉపేందర్, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి

ఖమ్మంసంక్షేమ విభాగం, జూలై24 (ఆంధ్ర జ్యోతి): గురువారం సుందరయ్య భవన్‌లో కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళులర్పించారు. జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కేరళ రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు చేశారని, పరిపాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చారని గుర్తు చేశారు. నాయకులు ఎం సుబ్బారావు, వై విక్రమ్, ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ

ఖమ్మంకలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం ఎస్సీ, బీసీశాఖల జిల్లాకమిటీని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు బిక్కు సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లాకార్యదర్శి కాంపాటి వెంకటరమణ పాల్గొన్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సిహెచ్ సీతారామారావు, ఉపాధ్యక్షుడిగా కె శ్రీనివాసరావు, వి.రఘూన్సీ కార్యదర్శిగా ఎంఏ షఫీ, కె కాశయ్య, అశోక్, పీవీ దుర్గారావు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా కె చంద్రశేఖర్, సీహెచ్. రాజ్యలక్ష్మీ, టి బాలకృష్ణ ఎన్నికయ్యారు.

మున్నేరు వరదను పరిశీలించిన కేఎంసీ కమిషనర్

- 12డివిజన్లకు 12మంది ప్రత్యేక అధికారుల కేటాయింపు
- మరో రెండురోజులు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం



ఖమ్మంకార్పొరేషన్, జూలై24(ఆంధ్రజ్యోతి): మున్నేరుకు వచ్చిన వరదలను బొక్కలగడ్డ ప్రాంతంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం పరిశీలించారు. మధ్యాహ్నం వరకు వరద 10.5 అడుగులకు చేరటంతో పాటుగా మున్నేరుకు వచ్చే వరదపై వివరాలు సేకరించారు. 16అడుగుల స్థాయిలోకి వరద నీరు చేరితే మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను కేటాయించారు. రాత్రిసమయంలోను అప్రమత్తంగా ఉండాలని, గతేడాది అనుభవాలతో పనిచేయాలని ఆదేశించారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని రామన్నపేట నుంచి దంసలాపురం వరకు 12 డివిజన్లకు 12మంది ప్రత్యేకఅధికారులను కమిషనర్ కేటాయించారు. కాగా గురువారం రాత్రికి మున్నేరు వరద తగ్గుముఖం పట్టింది. 9.5 అడుగులు నమోదు జరిగింది.

మహిళా డిగ్రీ కళాశాలలో జాషువా వర్ధంతి

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై24 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. జాషువా సాహిత్య వేదిక ఖమ్మం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య చేకూరి రమేష్ సభాధ్యక్షుడిగా, ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ పరంజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరంజ్యోతి, కవి నయీమ్ పాషా, కళాశాల వైస్‌ప్రెసిడెంట్ ఏ జే రామారావు మాట్లాడుతూ గుర్రం జాషువా జీవితం ఆదర్శప్రాయం అనుసరణీయం ఆయన పేదరికం, కులమత బేధాలు వలన ఎన్నో బాధలు అనుభవిస్తూ ఫిరదౌసి, గబ్బిలం లాంటి మహాకావ్యాలను రచించారని అన్నారు. జాషువా జీవితాన్న పిల్లలకు వివరించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌ఐఓ విశ్వేశ్వరరావు, తెలుగు విభాగం హెచ్‌ఓడి ప్రొఫెసర్ చేకూరి రమేష్ డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు ,అతిథి అధ్యాపకులు పేరెల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగుల కుటుంబాలకు ఎక్సైజ్‌శాఖ అండ

- ఇటీవల అనారోగ్య సమస్యలతో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల మృతి
- ఒక్కో కుటుంబానికి రూ.2.66లక్షల అందజేత


బాధిత కుటుంబాలకు చెక్కును అందిస్తున్న ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై24(ఆంధ్ర జ్యోతి): ఇటీవల కాలంలో మరణించిన ఇద్దరు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లకు తోటి కానిస్టేబుల్స్ అండగా నిలిచారు. పలు ఆరోగ్య కారణాలతో బి.లింగ, డీ.చంద్రు హెడ్‌కానిస్టేబుల్స్ మరణించారు. ఆయాకుటుంబాలకు అండగా నిలవాలని ఎక్సైజ్ కానిస్టేబుల్స్ సంఘం నాయకులు భావించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా కానిస్టేబుల్స్ రెండురోజుల వేతనాన్ని బాధిత కుటుంబాలకు ఇవ్వాలని నిర్ణయంచారు. ఇలావచ్చిన రూ.5,32,000 మరణించిన కుటుంబ సభ్యులకు ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీకమిషనర్ కార్యాలయంలో గురువారం చెక్కులను పంపిణీ చేశారు. డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఏఈఎస్‌లు కే.తిరుపతి, వీ.వేణుగోపాల్‌రెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు కానిస్టేబుల్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంస్పోర్ట్స్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం నగరంలోని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ గుండాల క్రిష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బెల్లం వేణు, బచ్చువిజయ్‌కుమార్ పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండోదశ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతూ ఎన్‌సీవిటీ ప్యాట్రన్ కింద ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని తెలిపారు. మొత్తం ఆరు ట్రేడ్‌ల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

మైనారిటీ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై24(ఆంధ్రజ్యోతి): మైనారిటీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్శీలు) కళాశాల యాజమాన్యం 2025-26 విద్యా సంవత్సరానికి పోస్ట్ మాట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి బి. పురంధర్, తెలిపారు. ఈనెల 1 నుంచి ఆన్ లైన్ ప్రారంభమైనదని, అక్టోబరు 30వరకు చివరి తేదీ అని చెప్పారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు

ఖమ్మంరూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): రానున్నఏదులాపురం మునిసిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కృషి చేయాలని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు అన్నారు. తెల్దారుపల్లి గ్రామంలో గురువారం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 14,15, 16,17 డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలోతమ్మినేని నవీన్, ఇనుప రాంబాబు, చావా సతీష్, బోడపట్ల రమేష్, కర్లపుడి ఉదయ్, అంబటి సుబ్బారావు, ప్రభాకర్, అంజయ్య, రంగారావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు పట్టాల పంపిణీ

కామేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి గురువారం వీటిని పంపిణీ చేశారు. లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

27న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్‌జూలై 24(ఆంధ్రజ్యోతి) ఈనెల27న కల్లూరు మినీ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20, సీనియర్ మెన్, ఉమెన్ విభాగాలతో పాటు అండర్-8, 10, 12 సబ్ జూనియర్ విభాగాలలో అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్‌అహ్మద్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను 7న జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నేపాల్ వాసి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం పొంది కోలుకున్న వ్యక్తి వివరాలు తెలపటంతో గురువారం జిల్లా న్యాయ సేవసదన్ జడ్జి కెవి చంద్రశేఖరరావు సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. గత మేనెలలో ఏన్కూరులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించి ఆ వ్యక్తిని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. వైద్య సేవల అనంతరం నేపాల్ దేశంగా చెప్పటంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కేజీబీవీ విద్యార్థినులకు ప్లేట్ల పంపిణీ

కామేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాతలింగాల కేజీబీవి పాఠశాల విద్యార్థినులకు పేట్లు పంపిణీ చేశారు. కొత్తలింగాలకు చెందిన తోటకూరి సీతమ్మ జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు ఉపేందరరావు, శ్రీనివాసరావు సహకరంతో అందజేశారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన తహసీల్దార్, కమిషనర్

వైరా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైరాలో లోతట్టు ప్రాంతాలను గురువారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ చింతా వేణు పరిశీలించారు. వైరాలోని రాజీవ్‌నగర్, ఇందిరమ్మ కాలనీ అలాగే సోమవరం నల్లచెరువు వాగు ఉధృతిని అలాగే వైరా నది పరిసరాలను పరిశీలించారు. నల్లచెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు ద్వారా నీరు పొంగి ప్రవహిస్తోంది. వైరా రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో కూడా భారీగా వర్షాలు కురిసి వరదనీరు వస్తుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని వారు సూచించారు.

సాయిబాబా ఆలయాల్లో భక్తుల పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

సత్తుపల్లి, జూలై24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుతోపాటు రాజీవ్‌కాలనీ, కొత్తూరు గ్రామాలలో సాయిబాబా ఆలయాలలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయిబాబాకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ జరిపి పూజలు జరిపారు. అనంతరం బాబా అలంకరణ తరువాత భక్తులందరికీ బాబా పాదదర్శనానికి అనుమతించారు. మధ్యాహ్న హారతి అనంతరం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిపించారు. ఆలయ నిర్వహకులు అత్యంత భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. సాయంత్రం సంధ్యాహారతి, పల్లకి సేవ చేపట్టారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

» తహసీల్దార్లకు వినతి పత్రాల అందజేత

ఏన్కూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించింది. అంనతరం తహసీల్దార్‌కు డిమాండ్లతోకూడిన వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏలను చెల్లించాలని సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని, 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులందరిని వారి సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పుల్లయ్య, టీపీటీఎఫ్ అధ్యక్షుడు వెంకటప్పయ్య, టీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కేజీబీవీ ఎస్‌వో లావణ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతకాని, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి గురువారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, ఖాళీలు భర్తి చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు తోటకూరి శ్రీనివాసరావు, ఉదారపు నాగేశ్వరరావు, పునాటి వెంకటేశ్వరరావు, వి రాంబాబు, జలీల్ పాషా పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కల్లూరులో గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట నాయకులు రాయల నాగేశ్వరరావు, కె విజయ్‌కుమార్, ఎం వెంకటేశ్వరరావు, పి రాములు మాట్లాడుతూ.. జీవో నెం 25 ను సవరించాలని, 60 మంది విద్యార్థులు దాటితేనే ముగ్గురు ఉపాధ్యాయులు అన్న నిబంధనను తక్షణమే ఉపసంహరించుకోవాలని, సమగ్ర శిక్ష ఉద్యోగల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విదానాన్ని పునరుద్ధరించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని వారు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు. నాయకులు జి.సుదీర్, బి.కృష్ణ, ఎం వేల్పాద్రి, రవీంద్ర పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు



చింతకానిలో..



కల్లూరులో..

కాకర్లపల్లిలో వైద్య శిబిరం విజయవంతం

సత్తుపల్లిరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని కాకర్లపల్లి ఎస్సీ కాలనీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అసంక్రమిత వ్యాధిగ్రస్థులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా జ్వరపీడుతుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శారారాణి, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఏఎన్‌ఎం మంజుల, ఆశా కార్యకర్తలు రాధ, జయమ్మ, ఉదయశ్రీ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బోనకల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో అనారోగ్యంతో వైద్య చికిత్స చేయించుకున్న వారికి గురువారం రూ. 1.19 లక్షల రూపాయల చెక్కులను గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర సుదాకర్, బత్తినేని తిరుపతయ్య, కాకాని హన్మంతరావు, అంచె భాస్కరరావు, కోట యువరాజు, కరివేద శ్రీహరి, శ్రీనివాసరావు, కిషోర్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ, నోట్ పుస్తకాల వితరణ

బోనకల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం ప్రాథమిక పాఠశాలకు గురువారం సుర్యనారాయణ తన భార్య వర్ధంతి సందర్భంగా రూ. 25వేల విలువ చేసే ఎల్‌ఈడీ టీవిని వితరణగా అందించారు. అదే విదంగా ఏడునూతల రామకోటేశ్వరరావు దంపతులు రూ. 7వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో దామాల పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతానికి దాతల ప్రోత్సాహకాలు అందజేయడం అబినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె ప్రపంచం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లా కొండలరావు, హెచ్‌ఎం కృష్ణ ప్రసాద్, డి. అనిత పాల్గొన్నారు.

బీజేపీ పాలన పెట్టుబడిదారుల కోసమే

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని

బోనకల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారి వర్గాల ప్రయోజనాల కోసం పని చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఘటనలో బాధ్యులైన వారిని పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పాకిస్తాన్ పై యుద్ధం ఎందుకు ప్రారంభించిందో, ఎందుకు నిలిపి వేసిందో తెలియక ప్రజలు అయోమయానికి గురయ్యారన్నారు. స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులు విజయం సాదించేలా ముందుగానే వ్యూహరచన రూపొందించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామిలను నేరవేర్చి మాటను నిలుపుకోవాలని సూచించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, పాపినేని రాంనర్సయ్య, రమేష్ పాల్గొన్నారు.

బోనకల్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాలు

బోనకల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే రాజకీయ చైతన్యవంతమైన మండలంగా పేరున్న బోనకల్‌కు ప్రత్యేకమైన చరిత్ర ఉంది. వామపక్షాలకు పెట్టని కోటలా దశాబ్ధాల తరబడి మండలంలోని పలు గ్రామాలు ఉన్నాయి. కాల క్రమేణా మారిన రాజకీయాలతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల ప్రాబల్యం పెరిగింది. మాజీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే బోనకల్ సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోటు వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల నాయకుడు మోర్ల మహేశ్వరరావులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వచ్చారు. బలమైన సామాజిక వర్గంతో సత్సంబంధాలతోపాటు కొండబాలకు అన్ని గ్రామాల్లో మంచి పరిచయాలు ఉండటంతో ఆయనతోపాటు చేరికలు బారిగానే ఉంటాయన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో వలసల జోరు సాగుతుండటంతో ఆ పార్టీ క్యాడర్లో నూతనోత్సహం ఉండగా, బీఆర్‌ఎస్‌లో పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు వారు శ్రమిస్తున్నారు.

భూభారతి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కొణిజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూభారతి ద్వారా భూసమస్యల పరిష్కారానికి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ కొణిజర్ల తహసీల్దార్ కార్యలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. మాట్లాడుతూ స్వీకరించిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. దరఖాస్తులకు సంబంధించి భూభారతి ఆన్‌లైన్ పోర్టల్‌లో నోటీసులు జారీ చేయాలని తెలిపారు. భూభారతి పోర్టల్ నీయమనిబంధనల మేరకు దరఖాస్తులపై పరిష్కార చర్యలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ, డీటీ రాము తదితరులు పాల్గొన్నారు.



భూభారతి దరఖాస్తుల ఆన్‌లైన్‌విధానాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

» ఉద్యాన అధికారి మధుసూదన్

మధిర రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ పంట లాభదాయకమని, ఒక్కసారి నాటితే 30సంవత్సరాల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట అని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం మధిర మండలం రాయపట్నం రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట ఒక ఎడారి పంట అని, ఎటువంటి పరిస్థితులలో అయినా తట్టుకుని దిగుబడులు ఇస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడులక్షల ఎకరాల వరకు సాగవుతోందని, 20లక్షల వరకు సాగులోకి వచ్చినా స్వయం సంమృద్ధి అవ్వలేమని, రైతులు పంట దర తగ్గుతుందని ఎటువంటి భయాందోళనలు పెట్టుకోకుండా ఆయిల్ పామ్ పంట వైపు మొగ్గు చూపాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి సాయిదీక్షిత్, ఉద్యాన అధికారి ఏ.విష్ణు, ఏఈవో గురుమూర్తి, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్

ఏన్కూరు గురుకులం ఆకస్మిక తనిఖీ

ఏన్కూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర జనరల్ (బాలుర) ఏన్కూరు గురుకుల పాఠశాలను ఆసంస్థ కార్యదర్శి రమణకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు . ఈసందర్భంగా తరగతి గదులను, డార్మెటరీ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనరంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలన్నారు. అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు.ఎంఈవో రహీంబీ, ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ వేమురాజు పాల్గొన్నారు.

అబద్ధాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

» జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అబద్దాలకు కేరాఫ్ అడ్రస్‌లా కాంగ్రెస్ పార్టీ పరిపాలన సాగిస్తోందని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ ఆరోపించారు. బోనకల్‌లో గురువారం జరిగిన ఆ పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 420 హామిలతో ప్రజలను మోసం చేసిన పార్టీగా కాంగ్రెస్‌ను అభివర్ణించారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగానే ఉంటుందని, తమ పార్టీకి డోకా లేదని దీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు చేబ్రోలు మల్లికార్జున్‌రావు,నాగేశ్వరరావు, బాణోతు కొండ, గద్దల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన యోగితా

కారేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలో చదివే పిల్లల సమగ్రాభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. గురువారం ఆమె విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజలతో కలిసి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, హస్టల్‌ను తనిఖీ చేశారు. అడిషనల్ డైరెక్టర్ రాజీవ్,ఆర్ జెడి సత్యానారాయణ రెడ్డి, జెడిఎస్ మదన్‌మోహన్,సమగ్రశిక్షజెడి వెంకటనర్సయ్య, కెజిబివి రాష్ట్ర కోర్డనేటర్ డాక్టర్ హెచ్ హరీష్,మోడల్ స్కూల్ రాష్ట్ర ఏ.ఎం.ఓ బిడిఆర్‌ఎస్ మంజురి, సీఎస్ఎఫ్ అసోసీయోట్ డైరెక్టర్ జి.సురే ష,పి జామ్,కో ఫౌండర్ ప్రాంజలి, పాఠక్, స్టేట్ జిసిడిఓ శిరీష్, జిల్లా విద్యాశాఖ అధజకారి సత్యానారాయణ, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈవో జయరాజ్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రవీందర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మధిర రోడ్డులో దిగబడిన లారీ

వైరా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డు అభివృద్ధి పనుల్లో జరుగుతున్న తీవ్ర జాప్యంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు జరుగుతున్న రోడ్డులో లోడ్‌తో ఉన్న ఒక లారీ దిగబడిన తీరే ఈ రోడ్డు పనుల జాప్యానికి ఒక ప్రత్యేక నిదర్శనమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. రూ.12కోట్లతో నాలుగులైన్ల రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టి ఏడాది కాలం దాటిపోయింది. ఈ పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. కేవలం 700మీటర్ల దూరం మాత్రమే రెండు లైన్లతో బీటీ వేశారు. మరోవైపు వెట్‌మిక్స్ వేసి మధ్యభాగంలో డివైడర్ల కోసం మట్టి పోశారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

ముదిగొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని ఏడీఏ విజయ్‌చంద్ర సూచించారు. గురువారం పలు ఫెర్టిలైజర్ షాపులు, గోదాములను ఆయన పరిశీలించారు. స్టాక్ వివరాలను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సరిత పాల్గొన్నారు.

వైరా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరాకు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్ పత్రాల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో వైరా ఏడీఏ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, రైతుసంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, యనమద్ది రామకృష్ణ, మాడపాటి మల్లిఖార్జున్, అమరనేని కృష్ణ, షేక్.పాషా పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ప్రాంతంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ రైతులకు పూర్తి స్థాయిలో యూరియాను అందుబాటులో ఉంచాలని (సిపిఎం అనుబంధ) రైతు సంఘ మండల అధ్యక్షుడు సామినేని హనుమంతరావు ప్రభుత్వ అధికారులను కోరారు. గురువారం కల్లూరులో రైతు సంఘ మండల సమావేశం జరిగింది. నానో యూరియాను వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణార్జునరావు, ఐద్వా మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి పాల్గొన్నారు.



సంస్థను లాభాల్లో నడిపిద్దాం: డీఎం

సత్తుపల్లిరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ లాభాలు ఆర్జించేందుకు ఉద్యోగులు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం డిపోలో అధిక ఆదాయం, ఇందన పొదుపులో ప్రతిభ చూపిన ఉద్యోగులకు క్యాష్ అవార్డులు, ప్రశాంశ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, సూపర్‌వైజర్లు వెంకటయ్య, బాలస్వామి, బాబూరావు, ఇజ్రాయేలు, కిన్నెర ఆనందరావు, ఈ.వెంకటేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెల మృతి



ఆత్కూరులో విద్యుదాఘాతంతో మృతిచెందిన పాడిగేదెలు

మధిర రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు పాడిగేదెలు మృతిచెందిన సంఘటన గురువారం మధిర మండలం ఆత్కూరు గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. బట్టా కృష్ణ అనే రైతు మేత కోసం తన పాడిగేదెలను ఆత్కూరు పిల్లిగుట్ట సమీపంలోకి తోలుకెళ్లాడు. పొలంలో గేదెలు మేత మేస్తుండగా చాలా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన పాడిగేదెల విలువ రూ.రెండులక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. పొలాల్లో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా వేలాడుతున్నాయని అధికారులెవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విద్యుదాఘాతంతో గేదెలు మృతిచెందాయని రైతు వాపోయాడు.

'ఇళ్ల' పనులు త్వరగా పూర్తిచేయండి: కమిషనర్

సత్తుపల్లిరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ కొండ్రా నరసింహా సూచించారు. సత్తుపల్లి మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో నిర్మాణంలోని ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. మంజూరు పత్రం అందిన 45రోజులలో నిబంధనలకు లోబడి నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్..

» మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్స్‌లో ఇసుక టిప్పర్ పట్టివేత

సత్తుపల్లిరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేకాట స్థావరంపై దాడిచేయగా మండలంలో ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ టీ.శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాల రోడ్డులో విశ్వసనీయ సమాచారం మేరకు పేకాటాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పేక ముక్కలతో పాటు రూ.42,650నగదు, మోటార్ సైకిల్, 5సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశాన్నామన్నారు. అదేవిధంగా మండలంలోని మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్స్ దగ్గరలో అశ్వారావుపేట వైపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ లారీని తనిఖీ చేయగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్ బాలకృష్ణ, క్లీనర్ ప్రవీణ్, యజమానులు కొండబాబు, సీతామహాలక్ష్మీ, అర్గనైజర్ తోకల సురేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను ఆంధ్రాలోని కొవ్వూరు నుంచి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

పోలీసుల చొరవతో కుటుంబ సభ్యుల చెంతకు యువకుడు



వైరా ఎస్ఐ సమక్షంలో కుమారుడితో తల్లిదండ్రులు

వైరా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గత 15రోజుల కిందట వైరాలో మతిస్థిమితం లేకుండా రోడ్ల వెంట తిరుగుతున్న వ్యక్తిని వైరా ఎస్ఐ పి.రామారావు తమ సిబ్బందితో కలిసి అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. సోషల్ మీడియా ద్వారా వివరాలు తెలుసుకున్న సదరు యువకుడి తల్లిదండ్రులు ఖమ్మం వెళ్లి అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావును కలిసి తమ కుమారుడి వివరాలు తెలిపారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు, తమ కుమారుడితో తల్లిదండ్రులు వైరా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ రామారావును కలిశారు. గత మూడు సంవత్సరాల కిందట తమ కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకుని తమ కుమారుడిని కలుసుకోగలిగామని తల్లిదండ్రులు ఎస్ఐకు వివరించారు. తమ కుమారుడిని కలుసుకునేందుకు కారకులైన ఎస్ఐ, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



సత్తుపల్లిలో



మధిరలో..



అమ్మపాలెంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు.

సత్తుపల్లిరూరల్ : సత్తుపల్లిలో మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, చాంద్‌పాషా, అనిల్, వల్లభనేని పవన్, అంకంరాజు, మధు, శ్రీను, కృష్ణారావు, ఆనందరావు, ఆయూబ్‌పాషా పాల్గొన్నారు.

వేంసూరు : మండలంలోని మర్లపాడులో మందపాటి మహేశ్వర్‌రెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొర్ల రామ్మోహన్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, హరిబాబు, తదతరులు పాల్గొన్నారు.

ముదిగొండ : ముదిగొండలో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల వెంకటప్రసాద్, గడ్డం వెంకట్, ఎర్ర వెంకన్న, ఆదినారాయణ, వీరస్వామి పాల్గొన్నారు.

మధిర రూరల్: మధిర పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ జడ్పీచైర్మన్, లింగాల కమల్‌రాజ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, అరిగె శ్రీను, వైవీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, మాధవి, రామారావు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా నాయకుడు మొండితోక దయాకర్ ఆధ్వర్యంలోనూ వేడుకలను నిర్వహించారు.

చింతకాని : మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, బొడ్డు వెంకటరామారావు, వేముల నర్సయ్య, పిన్నెల్లి శ్రీనివాస్, గడ్డం శ్రీను పాల్గొన్నారు.

కొణిజర్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపాలెంలో నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌బాబు, కిలారు మాధవరావు, రావెల శ్రీనివాసరావు, నెల్లూరి సత్యనారాయణ, చాంద్‌మియా, రాజ్‌కుమార్, పసుపులేటి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి మృతి పట్ల మాస్‌లైన్ సంతాపం

కొణిజర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామానికి చెందిన సీనియర్ ఆర్‌ఎంపీ వైద్యులు పఠాన్‌మౌలానాఖాన్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల సీపీఐఎంఎల్ మాస్‌లైన్ వైరా డివిజన్ నాయకులు పాశం అప్పారావు, నాయకులు తడికమళ్ల సీతారాములు, గుగులోతు సుక్కు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. నాయకులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, సుభద్ర, వెంకన్న, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలి

తల్లాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ వ్యాపార వాణిజ్య కేంద్రమైన తల్లాడలో వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు, కాంగ్రెస్ నాయకులు గురువారం మంత్రి తుమ్మలను కలిసి వినతి పత్రం అందించారు. మండలంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంతోపాటు మరో పది ప్రైవేటు పత్తి కొనుగోలు కేంద్రాలు, ఆరు కోల్డ్ స్టోరేజీలు, 12 రైస్‌మిల్లులు, రెండు దాల్ మిల్లులు ఉన్నాయని, మండలంలో సుమారు 40వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు అవుతున్నాయని, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం వల్ల తల్లాడలోని మార్కెట్ చెక్‌పోస్టు ద్వారా ఏడాదికి రూ.2కోట్లుకుపైగా ఆదాయం వస్తుందని వివరించారు. దీంతో మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించి తల్లాడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, జక్కంపుడి కిషోర్, గొడుగునూరి లక్ష్మిరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, రాము పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మునిగిన చప్టా

వైరా, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురం-సిరిపురం గ్రామాల మధ్య వైరా నదిలోని చప్టా పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ఈ రెండు గ్రామాల మధ్య లోలెవల్ చప్టా ఉండగా అడుగు మేర వరదనీరు చప్టా పైనుంచి ప్రవహిస్తోంది. వైరా రిజర్వాయర్ అలుగుల నుంచి వరద నీరు నదిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో ఈ చప్టా పైకి నీరు చేరింది. గురువారం రాత్రి కూడా భారీ వర్షం కురిసి వరద ప్రవాహం పెరిగితే గ్రామాల మధ్య రాకపోకలు నిల్చిపోయే అవకాశముంది.

